క్లుప్తంగా

కోతులు పట్టిస్తేనే పదవి!

అశ్వాపురం: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ అశ్వాపురం మండలంలో ఓ కొత్త చర్చ మొదలైంది. సర్పంచ్ కావాలనుకునే నాయకులు ఇప్పుడు అభివృద్ధి పనుల కంటే 'కోతుల బాధ'పై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. మండల వ్యాప్తంగా గ్రామాల్లో పంట పొలాలు, ఇళ్లు, పండ్ల చెట్లు, గల్లీల్లో విస్తారంగా తిరుగుతున్న కోతుల గుంపులు రైతులకు, గ్రామస్తులకు తలనొప్పిగా మారాయి. ఇంటింటా తిండి పదార్థాలు దోచుకోవడం, పంటలు నాశనం చేయడం, చిన్నపిల్లలను వృద్ధులను వెంబడించడం గాయాలు చేయడం వంటి చేష్టలకు పాల్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీలతో సంబంధం లేకుండా తమ ప్రధానమైన కోతుల సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చినవారినే గెలిపిస్తామని స్థానికులు ముక్త కంఠంతో చెబుతున్నారు.

ప్రశాంత వాతావరణంలో దసరా జరుపుకోవాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం డివిజన్ పరిధిలోని ప్రజలందరూ దసరా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా ముందుగా ఏఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ ప్రజలు ఎలాంటి గొడవలకు తావివ్వకుండా ప్రజలందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మొద్దని, అన్నిప్రాంతాల్లో నిఘా ఉంటుందని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. భద్రాచలంలో ఈ నెల 4న గోదావరి నదిలో అమ్మవారి విగ్రహాల నిమజ్జన సమయంలో డీజేలకు అనుమతి లేదని తెలిపారు.

ఆస్పత్రికి పరికరాలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆసుపత్రికి బుధవారం పాలేరు మాజీ ఎమ్మెల్యే తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్ తండ్రి భీమపాక భూపతిరావు తృతీయ వర్ధంతి సందర్భంగా భూపతిరావు సతీమణి శాంతమ్మ, ఆమె కుటుంబ సభ్యులు కలిసి బుధవారం రూ.2 లక్షలు విలువ గల స్ట్రెచర్స్, వీల్ చైర్లు, ఈసీజీ మెషిన్‌ను వితరణ అందజేశారు. భూపతిరావు కుటుంబ సభ్యులను ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రామకృష్ణ, ఆర్ఎంఓ డా.రాజశేఖర్ రెడ్డి అభినందించారు.

సరదాగా దసరా

- సొంతూళ్లకు చేరుకున్న పలువురు
- కళకళలాడుతున్న పల్లెలు..
- నేడు వాడవాడలా విజయదశమి వేడుకలు



కరకగూడెంలో ఒకే రంగు చీరలు ధరించిన మహిళలు

కరకగూడెం: దసరా వచ్చిందంటే పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. ఉద్యోగాలు, ఉపాధి కోసం ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా పండుగ కోసం సొంతూళ్లకు వచ్చేశారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన దేవీ నవరాత్రులు ముగియడంతో విజయదశమి వేడుకలకు అంతా ముస్తాబు అవుతున్నారు.

పట్టణాల నుంచి పల్లెల వైపు..

ఊర్లో దసరా అనుభూతిని ఏ మల్టీప్లెక్స్ సినిమా లేదా స్టార్ హోటల్ ఇవ్వలేదు. అందుకే ఎంతటి అత్యవసర పని ఉన్నా దసరాకు కచ్చితంగా ఇంటికి వస్తుంటారు. ఏడాదికి ఒకసారైనా ఊరి మట్టి వాసన పీల్చకపోతే కొందరికి పండుగ పూర్తైనట్టు అనిపించదు. వందలాది మంది తమ ఇళ్లల్లో అడుగుపెట్టి, పల్లె జీవితాన్ని, బంధాలను రీచార్జ్ చేసుకుంటారు.

యువతుల ఫొటోషూట్‌లు

దసరా సంబురాల్లో భాగంగా గ్రామీణ యువతులు, పట్టణాల నుంచి వచ్చిన విద్యార్థినులు, పండుగ సందర్భంగా అమ్మవారి వేషధారణల్లో ప్రత్యేక ఫొటోషూట్‌లు నిర్వహిస్తున్నారు. దుర్గ, లక్ష్మి, సరస్వతి, గాయత్రీ దేవి వంటి రూపాల్లో అద్భుతంగా ముస్తాబై, సాంప్రదాయ ఆభరణాలు ధరించి, స్థానిక ఆలయాలు లేదా పచ్చని పొలాల నేపథ్యాల్లో ఈ ఫొటోషూట్‌లు చేస్తున్నారు.

ఒకే రంగు చీరలు ప్రత్యేకత..

ఇటీవల అనేక గ్రామాల్లోని మహిళా సంఘాలు తమ సమూహ ఐక్యతను చాటుకోవడానికి దసరా లేదా బతుకమ్మ చివరి రోజున ఒకే రంగు చీరలు కట్టుకుంటున్నారు. ఇది కేవలం అలంకరణ మాత్రమే కాదు, వారి మధ్య ఉన్న సామాజిక అనుబంధాన్ని, ఐకమత్యాన్ని చాటుతోంది. ఊరేగింపులో ఒకే రంగు చీరల్లో మహిళలు నడుస్తుంటే, ఆ దృశ్యం కనుల పండువగా ఉంటుంది.

ఏటా రావణ వధ



20 అడుగుల రావణుడి బొమ్మ

గుండాల: దసరా ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ప్రతిఏటా రావణ వధ నిర్వహిస్తున్నారు. ఈ సారి కూడా 20 అడుగుల ఎత్తులో రావణుడి బొమ్మను తయారు చేస్తున్నారు. శ్రీ దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా దుర్గమ్మ విగ్రహం ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. మరోవైపు, 20 అడుగుల ఎత్తులో 10 తలల ఉండే విధంగా రావణున్ని తయారు చేసి, పెద్ద పెద్ద టపాసులు పెట్టి గ్రామ పొలిమేరల్లో దహనం చేస్తారు. జమ్మి పూజ చేసిన తర్వాత దుర్గామాతను ఊరేగింపుగా వచ్చి రావణ వధ చేస్తారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు స్థానికులు తరలివస్తారు. మండల కేంద్రానికి చెందిన యువకులు కొంతమంది శ్రీ దుర్గా మాత కమిటీగా ఏర్పడి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు.

రామచంద్రాపురంలో దసరా వేడుకలు

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురంలో గ్రామస్తులంతా కలిసి ఐకమత్యంతో బుధవారం దసరా వేడుకలు జరుపుకున్నారు. గ్రామంలోని బొడ్రాయి వద్దకు గ్రామస్తులంతా చేరుకొని బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గ్రామం వెలుపల తూర్పు వైపు జమ్మి చెట్టు నాటి పూజలు చేశారు. వేడుకల్లో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. 1953లో గ్రామం ఏర్పడగా ఆనాడు గ్రామానికి చెందిన మద్ది బక్కారెడ్డి, అల్లిపురపు సాయిరెడ్డితదితర పెద్దలు ఊరంతా ఉమ్మడిగా దసరా వేడుకలు జరుపుకునేందుకు శ్రీకారం చుట్టారు. ఆ కుటుంబాలకు చెందిన వారే ప్రతి ఏడాదీ వేడుకలకు నేతృత్వం వహిస్తున్నారు. ఆనాడు దసరా వేడుకలకు పోలీసులు వచ్చి గౌరవ సూచకంగా గాలిలోకి కాల్పులు జరిపేవారు. గ్రామం ఏర్పడిన నాటి నుంచి దసరా వేడుకలు ఊరంతా ఐక్యంగా జరుపుకుంటున్నారు.

సంక్షిప్త సమాచారం

తాగునీటి కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు



ఊట్లపల్లిలో ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊట్లపల్లి గ్రామంలో గడిచిన రెండు రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. పరిష్కరించాలని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన నిర్లక్ష్యం వహించడంతో బుధవారం సాయంత్రం భద్రాచలం–అశ్వారావుపేట ప్రధాన మార్గంలో ఖాళీ బిందెలతో బైఠాయించారు. విద్యుత్ లైన్ పనుల్లో గుంతలు తీయడంతో తాగునీటి పైపులు ధ్వంసమవగా.. వాటిని మరమ్మతులు చేయకపోవడంతో సమస్యల తలెత్తింది. ప్రధాన రహదారిపై అరగంటపాటు ధర్నా చేపట్టడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఎస్సై యయాతీ రాజు సంఘటన స్థలానికి చేరుకొని.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పైపులకు మరమ్మతులు చేయిస్తామని, అప్పటి దాకా ట్యాంకర్ ద్వారా నీళ్లు సరఫరా చేస్తారని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

అర్హులకు ఇళ్లు కేటాయించాలని..

అశ్వారావుపేట: అనర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించారని.. అర్హులైన వారికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ నందమూరి కాలనీకి చెందిన వారు బుధవారం జాతీయ రహదారిపై బోర్డర్ చెక్‌పోస్టు వద్ద రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. అధికారులు ఇళ్లు మంజూరు చేసిన వారిలో అనర్హులున్నారని వారిపై విచారణ జరిపి తమకు ఇళ్లు కేటాయించాలని కోరారు.

న్యాయవాది కుటుంబానికి చేయూత

భద్రాచలంఅర్బన్: కరోనాతో మృతి చెందిన భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యుడు శ్రీనివాస్ ప్రసాద్ కుటుంబానికి బార్ కౌన్సిల్ అఫ్ ఇండియా తరఫున రూ.1.50 లక్షల సాయం అందింది. ఆయన కుటుంబానికి ఆర్థికసాయం అందించాలని బార్ అసోసియేషన్ నుంచి విన్నవించగా, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి చొరవతో సాయం మంజూరైంది. ఈమేరకు చెక్కును బుధవారం భరణి శ్రీనివాస్ భార్య కవితకు బుధవారం భద్రాచలంలో అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దేవదానం, నందూరి శ్రీనివాస్‌తో పాటు విద్యాసాగర్, శ్రీనివాసన్, నాగరాజు, శ్రీనివాసచారి, అంబేద్కర్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

'స్థానికం'లో కమిటీలే కీలకం

ములకలపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో 9 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీలను ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. ములకలపల్లిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన పార్టీ మండల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రతీ ఎంపీటీసీ పరిధిలోని ఆయా కమిటీలే కీలకంగా వ్యవహరిస్తూ.. అభ్యర్థులను ఖరారు చేస్తారని, వారి గెలుపునకు కృషి చేస్తారని తెలిపారు. అనంతరం మండల పరిధిలోని 10 ఎంపీటీసీ పరిధిలోని కమిటీలను నియమించారు. మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుర్రం జయసుధ, పర్వతనేని అమర్‌నాథ్, పువ్వాల మంగపతి, గాడి తిరుపతి రెడ్డి, పేటేటి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

గుండాల: రానున్న స్థానిక ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల గెలుపుకోసం కార్యకర్తల కృషి చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆళ్లపల్లి మండలంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థులు ఎవరైనప్పటికీ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. నాయకులు రాంనర్సయ్య, ఎస్‌కె.ఖదీర్, అతహర్, పడిగ సమ్మయ్య, శ్రీకాంత్, ముత్తిలింగం, భరత్, రాము, రవి, పాపారావు, సమ్మక్క, సునీత, పర్వీన్ పాల్గొన్నారు.

కబడ్డీలో ప్రతిభ

దుమ్ముగూడెం: మండలంలోని కేరేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన పర్షిక దీవెన 35వ సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరచడంపై హెచ్‌ఎం సావిత్రి, పీఈటీ పార్వతిలు అభినందించారు. సెప్టెంబర్ 25 నుంచి 28 వరకు నిజామాబాద్‌లోని ముత్కల్‌లో జరిగిన 35వ సబ్ జూనియర్ కబడ్డీ స్టేట్ మీట్లో 33 జిల్లాలు పాల్గొనగా.. జిల్లా ప్రథమ స్థానంలో గెలుపొందారు. దీవెన భద్రాద్రి టీంకు సూపర్ రైడర్ గాను, ఆల్ రౌండర్‌గా ప్రతిభ కనబరిచింది.

ఎంబీబీఎస్ సీటు

ములకలపల్లి: ములకలపల్లి మండల పరిధిలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన సుంకర మేఘన ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. వైద్య విద్యలో ప్రవేశం కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్ష (నీట్)లో చక్కటి ర్యాంక్ సాధించింది. వికారాబాద్‌లోని మెడికల్ కాలేజీలో మేఘన ఎంబీబీఎస్ సీట్ సాధించింది. మేఘన తండ్రి సుంకర ప్రసాద్ స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గుమస్తాగా విధులు నిర్వహిస్తున్నాడు.

పలువురికి సత్కారం

చర్ల: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి విద్యార్థులు, రాత్రింబగళ్లు శ్రమిస్తున్న విద్యుత్ ఉద్యోగులు, సామాజిక కార్యకర్తలను ఎస్‌కేఎస్ చారిటీ ఆధ్వర్యంలో బుధవారం చర్లలో ఘనంగా సత్కరించారు. స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ షాజాహాన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించగా.. విద్యుత్‌శాఖ డీఈ కె.జీవన్‌కుమార్, ఏడీఈ టీ ప్రభాకర్, ఏఈ వెంకటేశ్వరావు ఎంఈఓ పీవీ రమణ, స్థానిక ప్రముఖులు ఎడారి భూపతి, జవ్వాది రవికుమార్, నీలి ప్రకాశ్ చింతూరి వెంకట్రావు, చీమల మర్రి మురళీకృష్ణ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

అశ్వారావుపేట: అశ్వారావుపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ పాత కార్యాలయ ఆవరణలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శిబిరాన్ని ప్రారంభించగా.. 35 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్‌పార్క్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు నరేంద్ర, సీతారామస్వామి, ఆత్మకమిటీ చైర్మన్ వీరభద్రరావు, దూపకుంట్ల దుర్గారావు, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.